# ఆడవాళ్ల పరిచయం

శ్రీ తంత్రవహి వెంకట్రావు

సాయంత్రం అయిదున్నర.

పగలంతా విశ్వమనే ఆఫీసులో బండచాకిరి చేసిచేసి అలసి కందిన ముఖంతో గూటికి చేరుకొంటున్నాడు జగత్ బంధు పశ్చిమాద్రి మీద.

సాంధ్య రాగపు ఎర్రదనంలో నగరమంతా విక్సితంగా వుంది.

హోటలువారు పుచితంగా వినిపిస్తున్న రేడియో సంగీతం, రిక్షాల చక్రాల చప్పుళ్ళు, బస్సుల హారన్‌లు కలిసి విపరీతమైన కోలాహలాన్ని సృష్టిస్తున్నాయి.

ఎందరెందరో వ్యక్తులు యెక్కడినుండో, యెక్కడికో వస్తున్నారు పోతున్నారు. జనాన్ని తప్పించుకొంటూ రిక్షాలు, రిక్షాల తప్పిస్తూ సైకిళ్ళు, సైకిళ్ళ నధిగమిస్తూ బస్సులు అలా ఒకరినొకరు అధిగమిస్తూ ముందుకు సాగిపోతున్నారు.

ఆ జన ప్రవాహంలో బడి తనూ పోతున్నాడు సూర్యం. తనకు తెలీకుండానే అలవాటుగా పెడల్ వేస్తున్నాయి కాళ్ళు. చేతులు హాండిలు కదపకుండానే సైకిలు సాగిపోతోంది.

అలవాటైన దారిలో చకచకా నడిచిపోయే గానుగ యెద్దులా ఆ సైకిలుకు కూడా ఆ రస్తా అలవాటై పోయినట్లుంది. తన ప్రయత్నం లేకుండానే అది జనాన్ని తప్పించుకొంటూ తన్ను మోసుకు పోతోంది.

సైకిలును చూస్తూంటే జాలి వేస్తుంది. అది తనలాగే ముసలిదై పోయింది. ఉద్యోగంలో చేరిన మొదటి రోజులోనే కొన్నాడు దీన్ని. అప్పుడు మిస మిస లాడుతూ నల్లగా పుష్టిగా వున్నట్లుండేది. కాని యీ పదిహేను సంవత్సరాలలోనూ, జీవంనశించి డొక్కలు పైకి కనిపించే గానుగ యెద్దులా తయారయింది. ముందు చక్రం టైరు మొన్న పేలిపోతే కుట్టించాడు. అప్పుడు దాని కది మూడోసారి. వెనక చక్రం పూర్తిగా అరిగిపోయింది. వెనక మడ్‌గార్డు సగం విరిగి యింకా సైకిలును పట్టుకొని వేళ్ళాడుతోంది. కళ్ళు చిగేలు మనిపించే హాండిలు బారు యిప్పు డెలా తయారయిందో చెప్పక్కరలేదు. వంకర తిరిగి నల్లగా మచ్చలు పట్టి చూడ్డానికి అసహ్యంగా వుంది. సీటుకు ఓ ప్రక్క స్ప్రింగు విరిగిపోతే తను జాగ్రత్తగా తాడుతో కట్టాడు. అంతకన్నా యేం చెయ్యగలడు? తనకే కడుపునిండా తిండి లేనప్పుడు అంతకంటే బాగా చేయించడానికి ఓపిక యెక్కడుంటుంది? అక్కడికి ఎలాగో యీడ్చుకొస్తున్నాడు. అతన్ని రోజూ రెండురెండు నాలుగు మైళ్ళు ఇంటినుండి ఆఫీసుకీ ఆఫీసునుండి యింటికీ త్రిప్పుతుంటుంది.

తనసలు ఒక కారే కొందామనుకున్నాడు. తన జాతకం ప్రకారం యీ తాలూకా ఆఫీసులో చేరవలసి వస్తుందనుకోలేదు. తనకు అదృష్టవంతులలాగే పట్టిన సంతకాలు పెడుతూ పంకా క్రింద కూర్చునే వుద్యోగమే వస్తుందనుకొన్నాడు. దర్జాగా జేబులో చేతులు పెట్టుకుని మాటాడే ఆఫీసరౌతా ననుకొన్నాడు. తను బియ్యే ఆఖరు సంవత్సరం వెలిగించే రోజుల్లో.

ప్రతి జీవికి ఒక ఆశ వుంటుంది. ఒక ఉన్నత దృష్టి వుంటుంది. అసలు ప్రతి జీవిలోని రక్తకణము నిత్యం తను ఒక వున్నత దశకు పోవడానికి ఆరాట పడుతూనే వుంటుంది. ఈ ఆశ అనేది జీవితంలో లేక పోతే బ్రతుకే భారమై పోతుంది. ఈ 'ఆశ' లేక పోతే ప్రపంచమంతా ఈ పాటికి యే నైరాశ్యతిమిరాల లోనో మునిగి చైతన్యం లేకుండా వుండిపోయేది.

సూర్యం కూడా అందరిలాగే తను చదువుకునే రోజుల్లో యెన్నో ఆశల్ని ప్రోగు చేసుకున్నాడు. తన దసలు లెక్కల గ్రూపు. ఇంజనీరింగు చదువుదా మనుకున్నాడు. దాలింబపళ్ళు శరీరం బలిచ్చి యింటరు పూర్తి చేశాడు. కష్టపడి క్లాసు కూడా సంపాదించాడు. కాని ఫలితం శూన్యమైంది. ఇంజనీరింగులో సీటు దొరక్క బియ్యేలో చేరవలసి వచ్చింది. అయినా పరవా లేదు. తను బియ్యే పాసవుతాడు. తనకేం లోటు. తర్వాత నెమ్మదిగా కలక్టరుకు చదవచ్చు అంటూ ఏవే వేటితో కలలు గన్నాడు.

ఆ రోజుల్లోనే పార్వతి నిచ్చి పెళ్ళి చేశారు. పార్వతి పూరికే రాలేదు. వస్తూ వస్తూ నాలుగు వేలు కట్నం కూడా తెచ్చింది.

తనుమాత్రం నిజంగానే సంతోషించా డా రోజుల్లో, పార్వతిని చూచి. పార్వతి పొట్టిగా పచ్చటిదైనా ఆమె రూపంలో, ఆమె మాటల్లో, ఒక విధమైన నాజూకుతనం, ఆకర్షణ, కలుపుగోలుతనం కనిపించేవి. పార్వతినిచూస్తే యేదో చిన్న గర్వం వుప్పొంగేది తనకు మనసులో. ఆ రోజుల్లో యెప్పుడు కాలేజీ వదలి యింటికి వెళ్ళి పడదామా అని వుండేది.

కాని యిప్పుడు తన కసలు యింటికే వెళ్ళ బుద్ధి అవ్వదు. ఇల్లంటేనే భయం. కాని, అదే పార్వతి యిప్పుడు యింటిదగ్గర తన రాకకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. కాని పార్వతిలోని అప్పటి రూపం, ఇప్పుడు లేదు. గుండ్రంగా నిగనిగలాడే ఆ శరీరం యిప్పుడు ముడతలుపడి ఎముకలు పైకి కనిపిస్తున్నాయి. మిసమిస లాడుతూ పచ్చదనాల విరిసే ఆ బుగ్గ లిప్పుడు చప్పబడి జవసత్వాలు పడిపున్నాయి. కండలు, రక్తంతో పటపట లాడే ఆ పార్వతి యిప్పుడు పట్టి యెముకల గూడు.

దీని కంతకూ కారణం తను. తన వుద్యోగమే! వంటినిండా రక్తం వుండడానికి తనకు రోజూ రెండు పూటలా తిండి వుంటేగదూ! ఒక రోజుంటే మరొక రోజు పస్తు.

అక్కడికీ ఎంతో ఓర్పుతో సంసారం యీడ్చు కొస్తోంది పార్వతి.

అన్నట్లు మరచిపోయాడు తను. ఈవేళ యింటికి వచ్చేటప్పుడు పిల్లవాడికి పాలడబ్బా కొని తీసుకు రమ్మంది పార్వతి.

సూర్యం జేబు తడుముకొన్నాడు. ఏ ముంది, ఏమీ పనికిరాని నాలుగు వుత్తరాలు, శుభలేఖ యింకేముంది ఏడు కానులూ తప్పిస్తే.

ఇం కెలా పాల డబ్బా కొనడం. అసలు నిన్ననే చెప్పింది పార్వతి బియ్యం నిండుకున్నాయి అని. ఎలాగో తను యింటికి చేరే ముందు యీ పూటకైనా బియ్యం, పిల్లాడికి పాలడబ్బా తీసుకు వెళ్ళాలి. వీటన్నిటికీ అధమం అయిదు రూపాయలన్నా కావాలి. తన కెక్కడొస్తాయి. యివాళ యింకా ఇరవై అయిదో తారీఖు. నెలంతా ఎద్దులా బండ చాకిరి చేస్తే నెలాఖరుకు వంద రూపాయలు మొగాన పడేస్తారు. ఇంకా ఎద్దే నయం. దానికి రోజు యేదో యింత తిండయినా దొరుకు తుంది యేలాగో ఒకలాగ.

తనకు జీతం అందాలంటే యింకా ఆరు రోజు లుంది. యీ లోగా యెలా? తను, పార్వతి, నలుగురు పిల్లలు, చంటిది మొత్తం ఏడు ప్రాణాలు యెలా బ్రతకాలి? వెధవ యిరవై అయిదో తారీఖన్నా ఇచ్చేయ కూడదూ జీతం.



"నిన్నే పది రూపాయ లడగాలనుకున్నా" అన్నాడు ప్రకాశం

తన కుర్రతనను ఆలోచనకు తనకే నవ్వు వచ్చింది. నీ తారీఖయితే ఏ ం యి ర వై కే జేబు ఖాళీ అయి కూర్చుంటుంది. ఈ చక్రంలో పడి అలా తిరగవలసిందే!

ఏది యేమైనా తన కిప్పుడు అయిదు రూపాయలు కావాలి. ఎలా అయినా అయిదు రూపాయలు సంపాదిస్తే ఈ రోజు గడుస్తుంది. తన కిప్పు డెలా వస్తాయి. ఎవరినైనా అప్పు అడగాలి. అంతకు తప్పించి గత్యంతరం యేముంది? ఎవరి నడగాలి? స్నేహితు లందరూ తనలాటి వాళ్ళే. వాళ్ళలో తమ జీవితావసరాలకు వచ్చే జీతపురాళ్ళను ఖర్చుపెట్టుకుని కొంత వెనుక వేసి అప్పు యివ్వగల స్తోమతు వున్నవాళ్ళెవరు?

అయినా బజారులో ఎవరైనా కనిపిస్తారేమోనని బజారంతా కలయ జూస్తున్నాడు సూర్యం. టిబ్బు హార్సులా తీసుకు పోతోంది సైకిలు, బజారు సంరంభం లోంచి.

ఎప్పుడూ బజారులోనే కనిపించేగిరి, శంకరం వీళ్ళెవళ్ళూ కూడా యీ వేళ అంతులేరు. అసలు అవసరం వచ్చినప్పుడు అన్నీ అలానే వుంటాయి. ప్రతి మనిషిని పరకాయించి చూస్తున్నాడు సూర్యం, యెవడయినా కనిపిస్తాడేమోనని.

అప్పుడే కాలేజీ వదిలారులా వుంది. అమ్మాయిలు జట్లు జట్లుగా రోడ్డు సగం భాగం వాళ్ళదే నన్నట్లు నవ్వుల కేరింతలతో నడుస్తున్నారు. వాళ్ళను చూస్తే నవ్వొచ్చింది సూర్యానికి.

ఇంకా వాళ్ళకు జీవితపు లోతులు తెలీవు. తమ బియ్యే, యెంయే ప్యాసయి ఏ కలెక్టరునో, ఏ ఇంజనీరునో పెళ్ళి చేసుకొని కాలు మీద కాలు వేసుని కూర్చుంటాం అనుకొంటున్నారు. కాని తనలాగే వాళ్ళు యే స్టైపు రైటరో గానో చేరవలసి వుంటుందని, జీవితంలో యెప్పటికీ నవ్వలేనిపరిస్థితి యేర్పడుతుందని వూహించనైనా వూహించటం లేదు అనుకున్నాడు సూర్యం వాళ్ళను చూస్తూ.

హుషారుగా నడుస్తున్న ఆ అమ్మాయిలను చూస్తూ క్షణం మరచి పోగలిగేడు తన్ను. ఆ అమ్మాయిలను చూచినప్పుడల్లా శంకరం జ్ఞాపకం వస్తూంటాడు తనకు. శంకరం తనూ బియ్యేలోనే మిత్రులయ్యారు. శంకరం యెప్పుడూ హుషారుగావుండేవాడు. ఎప్పుడైనా, తమ సెక్షనుకు ఒక్క అమ్మాయి అయినా లేదని, క్లాసంతా చాలా డ్రైగా వుందని, ఎకనామిక్స్ తెలుగు స్పెషల్ తీసుకొన్న ఆ నల్ల పిల్లలాంటిదైనా లేదని గోల పెట్టేవాడు. ఏమిటిరా నీ గోల అంటే "నీకేం తెలుసురా భాయి లోకం గూర్చి. ఈ ప్రపంచమంతా వాళ్ళ మీదే ఆధారపడివుంది. ఇంత అందమైన ప్రకృతికి, యింత ఉజ్వల సృష్టికీ బాధ్యత వాళ్ళదే. ఒక్కటి ఆలోచించు. ఈ స్త్రీ లేకపోతే ఈ ప్రపంచమంతా యెలా వుండేదిరా?" అని ప్రశ్నించేవాడు సృష్టి రహస్యాన్ని అంతనూ చిటికెలో తెలుసుకున్నట్లు.

వాడి మాటలు నిజమేమో అనిపించేదప్పుడు. అసలు వాళ్ళు లేకపోతే ప్రపంచం యేమయ్యేదో అనిపించేది. అసలు వూహించడానికే భయంకరంగా కనిపించింది. కాని మొన్న హఠాత్తుగా స్టేషనులో కనిపించాడు శంకరం.

మాసిన గడ్డం, లోతుకుపోయిన కళ్ళతో నీరసంగా వున్న ఆ అవతారం చూస్తూ ఆనవాలు పట్టలేకపోయాడు తను. శంకరం ధోరణి అంతా మారిపోయింది. తన కిప్పు డరడజనుమంది ఆడపిల్లలంటూ అందరూ యీడేరి కూర్చున్నారు. వెధవది యీ ఆడాళ్ళు ప్రాణంతీయడానికి చూస్తూండగా యెదిగిపోతారంటూ, పెద్ద వాళ్ళిద్దరికీ యెలాగో కష్టపడి పెళ్ళి చేశా, యింకా నలుగు రున్నారు యెక్కడయినా సంబంధం చూడమంటూ మొదలుపెట్టాడు. ఆ మాట్లాడిన అయిదు నిముషాలు అనేగొడవ. వాణ్ణి చూస్తే తనకు మతిపోయినట్లయింది.

అలా ఆలోచిస్తూనే బజారు దాటి వచ్చేశాడు సూర్యం. ఆ అమ్మాయిలు దూరం అయిపోయారు. తనుమళ్ళ తన గొడవలో పడ్డాడు. తన కిప్పు డయిదు రూపాయ లెవరిస్తారు? రెండు శేర్లు బియ్యం కొనాలి. పిల్లాడికి పాల డబ్బా, ఒక సంచు నూనె తీసుకవెళ్ళాలి. వీ టన్నిటికి అధమం అయిదు రూపాయలు కావాలి.

మొన్న కాన్పు వచ్చిన తరువాత మరీ నీరసపడిపోయింది. పార్వతి. ఆమెకు రెండు ఇంజక్షన్లు యిప్పించమని డాక్టరు చెప్పి అప్పుడే రెండు నెలలు కావస్తోంది. ఏ నెల కా నెల యేదో అవాంతరం వస్తూ అది పడనే లేదు.

ఒక్కసారి చెవులు గింయ్యు మన్నాయి. ఉలిక్కిపడి చూశాడు సూర్యం. తనప్పుడు సిమ్మెంటు ఫ్యాక్టరీదగ్గరికి వచ్చేశని ఆ క్షణమింటకాని తెలీలేదు

సూర్యానికి. అలాగేటులోకి చూశాడు. అప్పుడే గేటు లోంచి వస్తున్నాడు ప్రకాశం దుమ్ము దులుపుకొంటూ. ప్రకాశం తనూ చిన్ననాటినుంచి ఒకస్కూల్లో చదువు కున్నారు. ప్రకాశం స్కూలుఫైనలులో ప్యాసైపోయి యీ ఫ్యాక్టరీలో చేరాడు. తను బియ్యేదాకా చదివి లాయరాఫీసులో చేరాడు. ప్రకాశం పని బాగుందనే విన్నాడుతను. ఎల్లుండి వాళ్ళు బోనస్ అడిగింది యిస్తారంటారని వినికిడి. ప్రకాశాన్ని చూడగానే లోపల అంతరించిపోయిన ఆశ మళ్ళీ పైకి లేచింది ఏమన్నా సాయం చెయ్యగలడేమోనని.

"హలో ప్రకాశం" అని కేకవేశాడు సూర్యం. తల వంచుకుని యేదో ఆలోచిస్తూ వస్తున్నాడు ప్రకాశం చటుక్కున తలెత్తి "నువ్వా! సూర్యం!" అంటూ దగ్గర కొచ్చాడు.

మిత్రులిద్దరూ నెమ్మదిగా రోడ్డుమీద నడక ప్రారంభించారు.

"ఏమిటి విశేషం. ఆమధ్య బొత్తిగా కనిపించటం లేదు" అన్నాడు ప్రకాశం.

"ఆ ఏంలేదు. పని యెక్కువగావుంది. జమాబందీ లోటుగా."

"అవునోయి యెక్కడా ఊపిరి సలపనియ్యరు."

"అవునుకానీ మీమిల్లు విశేషాలేమిటి?" అన్నాడు సంభాషణ పెంచుదామని.

"మన బ్రతుకే ఓ పెద్ద విశేషమయితే యింకా విశేషాలు కావాలా? మన జీవితాలన్నీ యిలాగ పోతాయి లా వుంది. చూస్తుంటే విరక్తి కలుగుతోందోయ్. ఏమి టేమిటో చెయ్యాలనుకుంటాం కాని ఒక్కటీచెయ్యలేం వెధవ ఉద్యోగం" అన్నాడు ప్రకాశం ఆకాశంకేసి చూస్తూ.

"నీవుద్యోగానికేమోయి! బోనస్ ఇదీ యిస్తారుగా!"

"ఆ యిస్తాడు. రోజల్లా చాకిరీ చేయించుకొని యిదుగో చూస్తున్నావుగా. ఇంటికిపోయి తిండితిన క్కరలేదు. ఫ్యాక్టరీలోనున్నంతసేపూ ముక్కుల్లోంచి చెవుల్లోంచి లోపలకు నిత్యం పోతూనేవుంటుంది యీ దుమ్ము. ఇదంతా లోపలికిపోయి గడ్డకట్టిపోయింది. ఇంక తిండిమీద ధ్యాస యెందుకుంటుంది. ఎప్పుడు యే క్షయ పట్టుకుంటుందో యెవడికి తెలుసు?" అన్నాడు ప్రకాశం దుమ్ము దులుపుతూ జుట్టులోంచి.

సూర్యానికేమీ చెప్పడానికి పాలుపోలేదు. తను ప్రకాశాన్ని ఒక అయిదురూపాయలు బదులడగాలను కొంటున్నాడు. తీరా అడిగితే ఆత నియ్యగలడో లేదో! అప్పుడే చీకటి పడిపోయింది. అదే ఆలోచిస్తూ నడుస్తున్నాడు సూర్యం.

"సూర్యం ఏమిటో యీ గానుగెద్దు బ్రతుకు [illegible] కనిపిస్తుంది. ఎన్నో ఆశలుపెట్టుకుని జీవిస్తాం. ఒక్కటీ పూర్తి కాకుండానే చచ్చిపోతామేమో అనిపిస్తుంది" అంటూ చెప్పుకుపోతున్నాడు ప్రకాశం.

ఆ మాటలు వింటే ఒక్కసారి శరీరం జలదరించింది సూర్యానికి. అవును నిజంగా అంతేనేమో ననిపించింది కూడా! అలా ఆశలతోనే చచ్చిపోతామేమో! అది తలచుకొంటేనే భయంవేస్తోంది. తను చచ్చిపోతే యెలా? తన పెళ్ళాం, రెక్కరాని పిల్లలు వీళ్ళందరి గతేంకాను?

ప్రకాశం ఏమిటేమిటో చెప్పుకుపోతున్నాడు తన స్వంతగోడు. అవన్నీ అస్పష్టంగా వినిపిస్తున్నాయి సూర్యానికి. తనమెదడు తనయింటినిగూర్చి తనకీరోజు కావలసిన అప్పు గూర్చి తీవ్రంగా చర్చిస్తోంది.

"చూశావూసూర్యం! మొన్ననేమాఆవిడకవలపిల్లల్ని కందోయ్. కాని అప్పటినుండీ వున్న ఆరోగ్యం కూడా చెడిపోయిందోయ్. వెధవది యీ కరువు రోజుల్లో యిదొకటి పైగా. డాక్టరు నడిగితే ఇంజక్షను లియ్యాలన్నాడు. అంత డబ్బెడితే మన కీరోగా లెందుకొస్తాయంట" అంటూ తన గోడు యింకా చెబుతూనే వున్నాడు ప్రకాశం.

సూర్యం మెదడు కి మాత్రం అదేమీ వినిపించు కోవటంలేదు. ఇంటిని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తోంది.

ఏమిటీ ప్రపంచం. వినడిగోడవ వాడిది. ఎవరి కష్టాలు వారివి. తన యింటిని, ఆ పూట బత్తెపుఖర్చుల గూర్చి ఆలోచిస్తున్నాడు సూర్యం. తన పెళ్ళాం మందు గూర్చి చెబుతున్నాడు ప్రకాశం.

ఇద్దరూ అలా రోడ్డువెంట నడుస్తున్నారు. ఇద్దరు విడిపోవలసిన వీధి వచ్చింది. ఇంక ప్రకాశం వెళ్ళిపోతాడు. తను అడుగుదా మనుకొన్న అప్పు అడగాలి. వుందంటాడో లేదంటాడో అయినా అడగదలచుకొన్నతర్వాత యింకా వెనకాడటంయెందుకు.

"ప్రకాశం! ఒక్క అయిదురూపాయలు సర్దాలోయ్. పిల్లాడికి పాలడబ్బా, ఇంట్లోకి బి..." అంటూండగానే

"అరే! నీకు తెలియం దేముంది. ఈవేళ యిరవై అయిదో తారీఖు. ఇంకా నిన్నేనా పది రూపాయ లడగా లనుకుంటున్నా!" అన్నాడు నెమ్మదిగా ప్రకాశం.

ఇంకేముంది. ఆ ఆశకూడా పోయింది. ఇప్పుడింక అనవసరంగా అడిగానే అని బాధపడ్డాడు సూర్యం.

"ఏమీ అనుకోకు. వుందేమోనని అడిగాను" అన్నాడు సూర్యం మొగం పక్కకుపెట్టి.

"అనుకోడాని కేముంది నువ్వేలగనిపాడివా! అయినా మనందరం ఒక బండిని లాగేవాళ్ళమే. ఒకళ్ళను చూచి ఒకళ్ళు సిగ్గుపడాల్సింది లేదు" అన్నాడు ప్రకాశం.

ఇంక లాభం లేదనుకొని శలవు చెప్పి సూర్యం నడిచాడు. బాధపడుతూ అలా వెళ్ళిపోయాడు ప్రకాశం. అనవసరంగా అడిగి బాధపెట్టినే అని బాధపడ్డాడు సూర్యం. నా స్థితి చూసేంటే లోకంలో ఒకళ్ళను చూచి ఒకళ్ళు అలా సానుభూతిగా బాధపడటం తప్పిస్తే యింకేం సాయం చేసుకోలేరేమో యీ గుమాస్తా లనిపిస్తోంది.

సూర్యం ఆలోచిస్తూ యింటి మొగం పట్టాడు. ఈ పూటకు పిల్లాడి పాలడబ్బా మాట దేవుడెరుగు ఇంట్లో అందరూ పస్తే. తను పార్వతి అయితే ఆ పూటకు నగలరు. మరి పిల్లల మాటో. తను పంద రూపాయలు తెచ్చుకునే గుమాస్తా అయివుండి పిల్లల్ని కని పడుకోబెట్టవలసి వస్తుంది. "పెళ్ళాం బిడ్డల్ని పోషించుకోలేని తన కీ ఉద్యోగ మెందుకు. అసలు పెళ్ళాం బిడ్డల్ని పోషించలేని త నెందుకు పనికివస్తాడు. ఆలోచిస్తూ యిల్లు చేరుకున్నాడు సూర్యం.

సైకిలు చప్పుడు వినగానే తలుపు తీసుకుని యీవలికి వచ్చింది పార్వతమ్మ.

"ఇంత ఆలస్యం అయిం దేమండీ?" అంది తలుపు తీస్తూ.

తనేం చెబుతాడు. తను అప్పుకోసం తిరిగాడు. యెక్కడా దొరకలేదు. తనకు అయిదు రూపాయలు అప్పు దొరకలేదని, యిన్నాళ్ళు కాపురంచేసినా భార్య దగ్గర ఒప్పుకోడానికి బాధపడ్డాడు సూర్యం. కాదు సిగ్గుపడ్డాడు.

"ఊ!" అని మాత్రం మూలిగి సైకిలు లోపల పెట్టి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు ఆలోచిస్తూ యిం కేం చెయ్యవలసిన పని లేనట్లు.

"ఏమి టాలోచిస్తూ కూర్చున్నారు?" అంది పార్వతి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు పట్టుకువచ్చి.

"ఇంత కన్నా పనేముంది!" అన్నాడు విసుగ్గా.

"తర్వాత ఆలోచిద్దురుగాని. ముందు లేచి కాళ్ళు కడుక్కోండి. అన్నం చల్లారిపోతుంది" అంది పార్వతి సాగదీస్తూ.

తెల్లబోయాడు సూర్యం పార్వతి మాటకి. ఈ రాత్రి పూట పస్తే అనుకొన్న తనింట్లో అన్నం ఎక్కడి నుంచి వచ్చింది. ఇంట్లో బియ్యం నిండుకున్నాయి అన్న సంగతి తనకు తెలుసు. ఇదెలా వచ్చాయి బియ్యం.

"బియ్యం యెక్కడివి?" అన్నాడు సూర్యం ఆశ్చర్యంగా.

"లేకపోతే పస్తుంటామా! బదులు పట్టుకొ వచ్చాను" అంది.

"ఎవరి దగ్గర?" అన్నాడు అంత ధర్మాత్ములెవరా అని.

"సుభద్రమ్మ పిన్నిగారివద్ద" అంది ముక్తసరిగా.

"ఈ కొత్త పిన్నిగారి నెక్కడ సంపాదించావు" అన్నాడు సూర్యం.

"మీకు తెలీదూ. అదిగో ఆ ఎదురింట్లో దిగారుగా మొన్న. వా ళ్ళాయనకు తెనాలినుండి యిక్కడకి ట్రాన్స్ఫర్ అయింది" అంది వెలెటి చూపిస్తూ.

ఆ మాటకు మరీ ఆశ్చర్యపోయాడు సూర్యం. వాళ్ళు వచ్చి ఒక్క రోజైనా కాలేదు. అప్పుడే పరిచయం ఎలా జరిగిందో! అప్పు యెలా తెచ్చిందో అని. తను యింతకాలంబట్టి స్నేహం చేస్తున్నా ఒక్క అయిదురూపాయలు సంపాదించలేకపోయాడు మిత్రుని దగ్గరనుండి అని ఆలోచిస్తూ భోజనానికి లేచాడు.

"వాళ్ళు వచ్చింది మొన్ననేగా! అప్పుడే పరిచయం యెలా అయింది". అన్నాడు ఆశ్చర్యంగా అన్నం కలుపుకుంటూ.

"అదేమిటండీ! ఆడవాళ్ళ పరిచయానికి రోజులు కావాలండీ!" అంది పార్వతమ్మ సాగదీస్తూ. ★